# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రపంచ ఆహార భద్రతకు, సామాజిక అభ్యున్నతికి భారతదేశం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- ❖ దేశంలో గత దశాబ్దకాలంలో హింసను తగ్గించడంలో గణనీయమైన విజయాన్ని సాధించామని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ భారత్ - జపాన్ ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కావాలని విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ అన్నారు.
- ❖ మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలతో పాటు జార్ఖండ్ అసెంబ్లీ చివరి విడత ఎన్నికలు రేపు జరగనున్నాయి.
- ❖ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55వ ఎడిషన్ రేపు గోవాలో ప్రారంభం కానుంది.

================================

ప్రపంచ ఆహార భద్రతకు, సామాజిక అభ్యున్నతికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బ్రెజిల్ లోని రియో డి జనీరో నగరంలో జీ-20 శిఖరాగ్ర సదస్సులో "సామాజిక సమ్మిళితం, ఆకలి, పేదరికానికి వ్యతిరేకంగా పోరాటం" అనే అంశంపై జరిగిన సెషన్ లో ఆయన ప్రసంగించారు. ప్రపంచంలో సాగుతున్న ఘర్షణలు ఆహారం, ఇంధనం, ఎరువుల సరఫరాపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయని ప్రధానమంత్రి అన్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల గత దశాబ్ద కాలంలో భారతదేశంలో 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అదే విధంగా 80 కోట్ల మంది పౌరులకు ఉచిత ఆహార ధాన్యాలను అందిస్తున్నామని తెలిపారు. 55 కోట్ల మంది కోసం ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ఆఫ్రికా సహా ప్రపంచ ఆహార భద్రతకు భారతదేశం చేసిన కృషిని కూడా నరేంద్ర మోడీ ప్రస్తావించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో గత దశాబ్దకాలంలో హింసను తగ్గించడంలో గణనీయమైన విజయాన్ని సాధించామని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గుజరాత్ లోని గాంధీనగర్ లో 50వ ఆలిండియా పోలీస్ సైన్స్ కాన్ఫరెన్స్ ను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో హింస 70 శాతం తగ్గిందని తెలిపారు. పోలీసు వ్యవస్థ స్వభావం, పనితీరులో మార్పు రావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

కాగా బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్, నేషనల్ రక్షా శక్తి విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలతో పాటు జార్ఖండ్ అసెంబ్లీ చివరి విడత ఎన్నికలు రేపు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహారాష్ట్రలోని మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. 2 వేల 86 మంది స్వతంత్ర అభ్యర్థులు సహా మొత్తం 4 వేల 136 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జార్ఖండ్ లో చివరి దశ పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. మొత్తం 12 జిల్లాల్లోని 38 నియోజకవర్గాలలో ఓటర్లు ఓటు... వేయనున్నారు. 55 మంది మహిళలు సహా 528 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కోటి 23 లక్షల మంది ఓటర్లు అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55వ ఎడిషన్ రేపు గోవాలో ప్రారంభం కానుంది. ఈ నెల 28వ తేదీ వరకు ఈ చలన చిత్రోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ వివరాలను గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఈ రోజు పాత్రికేయులకు వెల్లడించారు. ఈ చిత్రోత్సవాలు 81 దేశాలకు చెందిన 180 అంతర్జాతీయ చిత్రాలను ప్రదర్శించనున్నామని ఆయన తెలిపారు. ఉత్సవ వేదికల వద్దకు నిరంతరాయంగా ప్రయాణించేందుకు ఉచిత రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. ఇదిలా ఉండగా, ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, నటీనటులు మాధవన్, రకుల్ ప్రీత్ సింగ్, పంకజ్ కపూర్ సహా చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఈ ఫెస్టివల్ కు హాజరుకానున్నారు. ఈ సంవత్సరం ఆస్ట్రేలియాను కంట్రీ ఆఫ్ ఫోకస్ గా ఎంపిక చేశారు. ఈ ఉత్సవాలలో హాజరైన వారి భద్రత కోసం గోవా ప్రభుత్వం పటిష్టమైన భద్రతా చర్యలతో సహా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - జపాన్ ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కావాలని భారత విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ అన్నారు. బ్రెజిల్ లో జరుగుతున్న జీ-20 సదస్సులో భాగంగా జపాన్ విదేశాంగ శాఖ మంత్రితో సమావేశయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రెండు దేశాలు పరస్పరం సహకరించుకోవాలని ఆయన కోరారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో మరింత అభివృద్ధి దిశగా ఈ సహకారం ఉండాలని కేంద్రమంత్రి జైశంకర్ పేర్కొంటూ..

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 25 నుంచి డిసెంబర్ 20 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంట్ హౌస్ లో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరగనుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈ రోజు ప్రకటించారు. పార్లమెంట్ ఉభయసభల్లోని అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లను సభా వ్యవహారాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశానికి ఆహ్వానించింది. సభ సజావుగా సాగడంతో పాటు ముఖ్యమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఈ నెల 26న ప్రత్యేక వేడుకలు జరగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం నిలిచిపోయిన చర్చలను పునఃప్రారంభిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి కెయిర్ స్టార్మర్ ప్రకటించారు. వచ్చే సంవత్సరం ప్రారంభంలోనే రెండు దేశాల మధ్య చర్చలు మొదలవుతాయన్నారు. బ్రెజిల్ లో జరుగుతున్న జీ-20 సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. భారతదేశంతో కొత్త వాణిజ్య ఒప్పందం బ్రిటన్ లో ఉద్యోగాలు, శ్రేయస్సుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. కాగా, భద్రత, విద్య, సాంకేతిక పరిజ్ఞానం, వాతావరణ మార్పులు వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవడం కోసం భారతదేశంతో కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బ్రిటన్ కోరుకుంటుందని బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 22వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వైమానిక దళం ద్వైవార్షిక కమాండర్ల సదస్సు ప్రస్తుతం న్యూఢిల్లీలో జరుగుతోంది. వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ హాజరైన ఈ సదస్సులో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈ రోజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత వైమానిక దళం ఉత్తర సరిహద్దుల్లో శీతాకాల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడం మీద ఈ సదస్సులో చర్చించారు. సీనియర్ కమాండర్లు దళం శక్తి సామర్థ్యాలను మరింత పెంచడానికి వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికలపైన సదస్సులో చర్చించారు. రేపటితో ఈ సదస్సు ముగియనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ.. ఉద్గారాల నుండి విముక్తి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామి అన్నారు. దేశంలో ఈ-మొబిలిటీని వేగవంతం చేయడంపై ఢిల్లీలో ఈ రోజు జరిగిన జాతీయ సదస్సులో మంత్రి ప్రసంగించారు. సుస్థిర రవాణాకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇంధన భద్రత, స్వచ్ఛమైన గాలి, ఆధునీకరించిన రవాణా పనితీరుని ప్రతిభింబిస్తుందన్నారు. 2070 నాటికి దేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంధన ఉద్గారాలను సున్నా లక్ష్యానికి చేరువ చేసేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం దోహదపడుతుందని కుమారస్వామి తెలిపారు. సంప్రదాయ ఇంధన వాహనాల నుండి ఎలక్ట్రిక్ వాహనాలకు మారడానికి భారతదేశం వేగంగా ప్రయత్నాలు చేస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 77,548 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై, చివరకు 77,578 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 23,518 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.42గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.90 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు మళ్లీ 2600 స్థాయిని దాటి 2,633 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =